ట్రాఫిక్ చిక్కులకు ప్రత్యేక చర్యలు

మెహిదీపట్నం జనవరి 7: నగరంలో ట్రాఫిక్ రద్దీ రోజు రోజుకీ పెరుగుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగం గా మెహిదీపట్నంలో ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేయడానికి ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

మెహిదీపట్నం నుంచి నగరం వైపు వెళ్లే వాహన దారులకు ఇబ్బందులు కలుగకుండా బస్సుల కోసం రోడ్డుపై వేరుగా దారిని ఏర్పాటు చేశారు. మెహిదీపట్నం పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 19 నుంచి 12 వద్ద ఉన్న బస్టాప్ వరకు బస్సుల కోసం వేరుగా దారిని ఏర్పాటు చేశారు. నానల్‌నగర్ వైపు నుంచి, మెహిదీపట్నంలో యూటర్న్ తీసుకునే బస్సులు బస్టాప్‌లోకి ఈ దారిలోనే వచ్చేలా ట్రాఫిక్ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

మెహిదీపట్నం నుంచి నగరం వైపు వెళ్లే బస్సుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దారి

ట్రాఫిక్ చిక్కులు తప్పాయి

మెహిదీపట్నం నుంచి నగరం వైపు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ చిక్కులు తప్పించాలన్న ఆలోచనతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సుల కోసం ప్రత్యేక దారిని ఏర్పాటు చేశాం. దీంతో ప్రస్తుతం మెహిదీపట్నంలో రద్దీ వేళల్లో ట్రాఫిక్ చిక్కులు తప్పాయి. ఆర్టీసీసిబ్బందికి ఖచ్చితమైన ఆదేశాలను ఇవ్వడంతో ట్రాఫిక్ జాం ఏర్పడటం లేదు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎల్లవేళలా కృషి చేస్తున్నాం.

– బాలకృష్ణాగౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ పావని తదితరులు

క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 7: పద్మశాలి ప్రజా సంఘం ముషీరాబాద్ ఆధ్వర్యంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం అశోక్‌నగర్ చౌరస్తాలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, బీఆర్ఎస్ యుజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గుర్రం చంద్రకళ శంకర్ హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తలకొక్కుల సంజీవ్‌కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి బింగి నవీన్‌కుమార్, బీజేవైఎం నగర మాజీ నాయకుడు వినయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు గుర్రం శంకర్ చేనేత వర్గాల చైతన్యవేదిక అధ్యక్షుడు చిక్కా దేవదాస్, నాయకులు శ్రీనివాస్, నవీన్, వంశీ, ప్రశాంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ చక్రపాణి

టీచర్లు జ్ఞానానికి ప్రతినిధులుగా ఉండాలి

చిక్కడపల్లి, జనవరి 7: ఉపాధ్యాయులు జ్ఞానానికి ప్రతినిధులుగా ఉండాలని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ధర్మ టీచర్స్ యూనియన్(డీటీయూ) ప్రతినిధి ఆశన్న అధ్యక్షతన ఆవిర్భావ సభను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్లు తిరుమలి, మురళీమనోహర్, డాక్టర్ విశారదమహారాజ్, రామయ్యయాదవ్, ధర్మ ప్రతినిధిలు సొద అరుణ, లింగయ్యయాదవ్, దామెర ఉపేందర్, నాగరాణి, ఎన్. రమేశ్, పి.అశోక్ పాల్గొన్నారు.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సన్మానిస్తున్న చంద్రప్రకాశ్‌రెడ్డి, బడేసాబ్ తదితరులు

సమాజంలో సాహితీవేత్తల పాత్ర గొప్పది

రవీంద్రభారతి, జనవరి 7: సమాజంలో మార్పు తీసుకురావడంలో సాహితీవేత్తల పాత్ర చాలా గొప్పదని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ఆది వారం గోల్కొండ సాహితీ కళాసమితి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక, తెలంగాణ భాష చైతన్య సమితి, లక్షసాధన ఫౌండేషన్ సం యుక్త ఆధ్వర్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సాహిత్య, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో సన్మాన సభను రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహిత్య, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు స్పీకర్‌ను సత్కారించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు డా. చంద్రప్రకాశ్‌రెడ్డి, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, బీపీ నర్సింహులుగుప్తా, డా.భుజంగరెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

రోడ్డు పనులు పరిశీలన

చిక్కడపల్లి, జనవరి7: రాంనగర్ డివిజన్ దయార్ మార్కెట్‌లో ఆదివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ వీడీసీ రోడ్డు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు నిర్ణత సమయంలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, శంకర్ ముదిరాజ్, ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, ఖాశీయాదవ్, అరుణ్, రాజినికాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

చార్మినార్, జనవరి 7: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మెడికల్ ఆంకాలజీ సర్వీసెస్, రెనో గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ పాలంకీ సత్యదత్తాత్రేయ అన్నారు. ఆదివారం 'అగర్వాల్ శిక్షాసమితి రెనోగ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్' సంయుక్తాధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. అగర్వాల్ శిక్షా సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ కేడియా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నియమిత సమయంలో వ్యాయమం చేస్తూ ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవీంద్రనాథ్, యుగంధర్‌శర్మ, రాఘవ్‌సునీల్, మహ్మద్ ఆరిఫ్‌హుస్సేన్, గాయత్రి, సూర్యప్రకాశ్ హెడ్డా, మధులత, నవీన్‌రెడ్డి, దివ్యకిరణ్, మాధవిమాజేటీ, పారమెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మెహిదీపట్నం జనవరి 7: నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం మల్లేపల్లి డివిజన్ ఆగాపురా, హబీబ్‌నగర్ ప్రాంతాల్లో ఆయన ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్‌తో కలిసి పర్యటించారు.

ప్రజాపాలనలో 64,621 దరఖాస్తులు

అబిడ్స్, జనవరి 7: ప్రజా పాలన కార్యక్రమంలో ఇప్పటి వరకు అభయ హస్తం కోసం 64,621 మంది దరఖాస్తు చేసుకున్నట్లు జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలయ్య తెలిపారు. అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల ఆరవ తేదీ గడువు తేదీ విధించగా గోషామహల్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా కేంద్రాల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. ఇతరత్రా దరఖాస్తులు 14,827 అందినట్లు పేర్కొన్నారు.

కరాటేలో సత్తాచాటిన చిన్నారులు

పిల్లలకు ఆత్మరక్షణ కోసం కరాటే దోహదపడుతుందని కరాటే మాస్టర్ విక్కీ అన్నారు. ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో జరిగిన 6వ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో అంబర్‌పేటకు చెందిన చిన్నారులు ఛాంపియన్లుగా నిలిచారు. షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కరాటే పోటీల్లో నాలుగు రాష్ట్రాల నుంచి పోటీదారులు పాల్గొనగా అంబర్‌పేటకు చెందిన చిన్నారులు ఆరు గోల్డ్, ఏడు సిల్వర్, ఒక కాంస్య పథకాన్ని సాధించి సత్తాచాటారు. – అంబర్‌పేట, జనవరి 7

సమాజ మార్పులకు అణుగుణంగా పరివర్తన చెందాలి

సుల్తాన్‌బజార్, జనవరి 7: నేటి సమాజ మార్పులకు అణుగుణంగా యువ ఆర్థోపెడిక్ వైద్య విద్యార్థులకు అత్యాధునిక వైద్య విధానంలో మెళుకువలను నేర్పేందుకు హోం వంటి సదస్సులు దోహదం చేస్తాయని ఉస్మానియా దవాఖాన ఆర్థోపెడిక్ మాజీ విభాగాధిపతి, హోం వ్యవస్థాపకుడు డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు ఉస్మానియా మెడికల్ కళాశాలలో మూడు రోజులుగా దవాఖాన ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోం 2024 సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సులో హోం వైస్ చైర్మన్‌లు డాక్టర్ రమేశ్, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, సమన్వయకర్తలు డాక్టర్ శేఖర్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ సుధీర్, డాక్టర్ శివరాం పాల్గొన్నారు.

దేవాలయాలపై ఎండోమెంట్ పెత్తనం తొలగించాలి

- ఏకం సనాతన్ భారత్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్‌షా

రవీంద్రభారతి, జనవరి7: రాజకీయ నాయకలు అన్ని పార్టీల వారు రకరకాల కుట్రలతో హైందవ సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తూ మన దేవాలయాల ఆస్తులను, రాబడిని దోపిడీ చేస్తూ, ఇతర మతాల వారి అభివృద్ధికి కేటాయిస్తూ దుర్వినియోగం చేస్తున్నారని ఏకం సనాతన్ భారత్‌దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజీవ్‌షా, నరేంద్రకుమార్ చతుర్వేదిలు అన్నారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలపై ఉన్న ఎండోమెంట్‌ను తక్షణమే తొలగించి హిందూ దేవాదాయ సంస్థలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. దేవాలయాలు, మఠాలపై ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ ఎత్తివేయాలని, కాశ్మీర్‌లోని పురాతన సూర్యదేవాలయం, మార్తాండ్ ఆలయం, మధురలోని శ్రీకృష్ణజన్మభూమి, కాశీ వారణాసిలోని జ్ఞానవాసి తీర్థక్షేత్రాన్ని తక్షణమే పునః స్థాపన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సనాతన హిందూ దేశమైన భారతలో హిందువులకు న్యాయం జరుగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ, ప్రస్తుతం బీజేపీ పార్టీలు కేవలం హిందువులమని ప్రగల్భాలు పలుకుతూ మైనార్టీలకే ప్రాధాన్యత నిస్తున్నారని తెలిపారు. కశ్మీర్‌లోని వైష్ణవి దేవాలయాన్ని ధార్మిక సంస్థలకు తక్షణమే అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు.

మండెపల్లి గంగపుత్ర సంఘం కార్యవర్గం ఏర్పాటు

మండెపల్లి గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గం

అంబర్‌పేట, జనవరి 7: మండెపల్లి గంగపుత్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గోల్నాకలోని సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘం సభ్యులు కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ చైర్మన్‌గా మాల్ కాశీరాం, అధ్యక్షుడిగా సందిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మాల్ యాదగిరి, కోశాధికారిగా మాల్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సింగీతం శివరాజ్, మాల్ రవీందర్, బిజ్జి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగటా సింగీతం మురళీకృష్ణ, సందిరి అనిల్‌కుమార్, సంగీతం సాయిప్రసాద్, మాల్ శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సింగీతం నర్సింగ్‌రావు, సింగీతం రాంప్రసాద్, సింగీతం సునీల్, మాల్ మల్లేశ్, మాల్ శ్రీనివాస్, సింగీతం శ్రీకాంత్, ఇంక కార్యవర్గ సభ్యులు, సలహాదారులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు.

ఉచిత వైద్యసేవలందించడం అభినందనీయం

సమావేశంలో మాట్లాడుతున్న సరోజావివేక్, పాల్గొన్న చైర్మన్ గోపాల్‌రావు తదితరులు

కాచిగూడ, జనవరి 7: మానవ సేవయే మాధవ సేవగా పేదలకు ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయమని అంబేద్కర్ కళాశాల చైర్మన్ సరోజావివేక్ అన్నారు. హిందూ శ్మశానవాటిక ప్రభందక కమిటీ చైర్మన్ ఎస్. గోపాల్‌రావు ఆధ్వర్యంలో పేదల కోసం హర్రాస్‌పెంటలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం, ఉచిత కుట్టుశిక్షణను ప్రారంభించి రెండేండ్లు పూర్తైన సందర్భంగా ఆదివారం మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సరోజావివేక్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యాన్ని అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి రాధికాకృష్ణ, డాక్టర్ రమాదేవి, ప్రతినిధులు రాజ్‌కుమార్ విగ్, రాజేందర్‌పటేల్, వీరస్వామి, విజయ్‌కుమార్, సాయిగిరిధర్, బి.కృష్ణాగౌడ్, సత్యనారాయణ, నర్సింగ్‌రావు, నందకిశోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లగడ్డలో అమ్మవారికి బోనాలు

తాళ్లగడ్డలో నూతనంగా పునఃప్రతిష్ఠించిన బొడ్డురాయి నాభిశిల కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా తాళ్లగడ్డ, కార్వాన్ ప్రాంతాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. – కార్వాన్, జనవరి 7

కేంద్రప్రభుత్వ పథకాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కవాడిగూడ, జనవరి 7: అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ముషీరాబాద్ నియోజక వర్గం ఇన్‌చార్జి ఎం.రమేశ్‌రామ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు అన్నారు. ప్రధాని మోదీ పదేండ్ల సుపరిపాలనలో ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాలన్న సదుద్దేశంతో దేశవ్యాప్తంగా తిరుగుతున్న 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'వాహనం ఆదివారం కవాడిగూడకు చేరుకుంది. ఈ సందర్భంగా పథ కాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కవాడిగూడ కమ్యూనిటీ హాల్‌లో ఒక ప్రత్యేక వాహనంలో జన్ ధన్ యోజన, ఉజ్వల గ్యాస్ పథకం, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భద్రతకు సంబంధించిన అధికారులు, ఆధార్ మార్పులు, చేర్పులు చేసేందుకు అధికారులు హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రమోహన్, గంట శ్రీనివాస్, రాజేందర్, లక్ష్మణ్, కృష్ణ, హరి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌దార్‌ఖాన్‌పేట్‌లో రామజన్మభూమి అక్షితల యాత్రలో పాల్గొన్న వీహెచ్‌పీ నాయకులు

ఇంటింటా అయోధ్య అక్షింతలు పంపిణీ

అబిడ్స్, జనవరి 7: అయోధ్య అక్షింతలను గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో పంపిణీ చేశారు. మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో బీజేపీ, విశ్వ హిందూ పరిషత్, బీజేపీ నాయకులు ఇంటింటా తిరిగి అక్షింతలను ప్రజలకు అందజేశారు.

అక్షింతలను ఈ నెల 22వ తేదీ న అయోధ్యలో స్వామి వారి ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్నందున అక్షింతలను తలపై వేసుకుని ఇంటి ముందు ఐదు దీపాలను వెలిగించాలని ప్రజలను కోరారు. మంగళ్‌హాట్ కార్పొరేటర్ ఎం శశికళ కృష్ణ, రేగొండ రాములు, శ్రీనివాసచారి, రాకేశ్, ఉమాశంకర్ సింగ్ తదితరులు ఇంటింటా తిరిగి అక్షింతలను అందజేశారు. హిందీనగర్‌లోని పలు ప్రాంతాలలో అక్షింతలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రఘు, జీవన్, మయూర్, ఆనంద్, కాజల్, జన్న సన్ని తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రభుత్వ విప్ బీరెళ్ల ఐలయ్యను ఆదివారం పాతనగర బహదూర్‌పుర నియోజకవర్గ కూర్మ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రతినిధి సాయి కిరణ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

– చార్మినార్, జనవరి 7

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

మెహిదీపట్నం జనవరి 7: జీహెచ్ ఎంసీ పారిశుధ్య విభాగం కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. ఆదివారం ఉదయం టోలిచౌకిలో పారిశుధ్య కార్మికులు ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చిక్కడపల్లి, జనవరి 7:అర్హులందరికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు గుర్రం చంద్రకళ శంకర్ అన్నారు. గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం శంకర్, అభిషేక్ కెన్నెడీ, నర్సింగ్‌రావు, సురేశ్‌యాదవ్, గుండు జగదీశ్‌బాబు, సుబ్బారావు. గిరి, శ్రీనివాస్‌రెడ్డి, హఫీజ్ పాల్గొన్నారు.

కన్నుల పండవగా సంక్రాంతి సంబురాలు

విజయమాధవి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్ వేదికపై ఆదివారం కన్నుల పండవగా సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింభించే విధంగా కళారూపాలను ప్రదర్శించారు. గురువులు డాక్టర్ రాధ, మోహన్, టీవీ నటి రాగిణి చిన్నారులకు పలు సూచనలు చేసి అభినంధించి గురువులను సత్కరించారు. – తెలుగు యూనివర్సిటీ, జనవరి 7

అయోధ్య రాములవారి అక్షింతల కలశ యాత్ర

మెహిదీపట్నం జనవరి 7: నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ డివిజన్ గుడిమల్కాపూర్ మండులగూడలో ఆదివారం రామ జన్మభూమి తీర్థ క్షేత్రం అక్షింతల కలశ యాత్రను ఇంటింటికీ నిర్వహించారు. స్థానిక నాయకులు చెన్నబత్ని ముఖేశ్‌కుమార్ నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందించారు. ఈ సందర్భంగా జనవరి 22వ తేదీన చేయాల్సిన ఆధ్యాత్మిక కార్యక్రమాలపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

20, 21 తేదీల్లో మహిళా కిక్‌బాక్సింగ్ పోటీలు

రవీంద్రభారతి, జనవరి 7: బాలబాలికల ఆత్మరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఖేలో ఇండియా మహిళా కిక్ బాక్సింగ్ పోటీలు ఈ నెల 20, 21 తేదీల్లో ఎల్బీస్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ.. కిక్‌బాక్సింగ్ శిక్షణ పొందిన ప్రతి మహిళ అర్హురాలేనని అన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సాధారణ రుసుం రూ. 200 చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావు, శేఖర్, పోచయ్య, తిరుపతి, పూర్ణచందర్, రవికుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఎస్ఎస్‌కె సమాజ్ 2024 సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రహీంపురాలోని సమాజ్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు నగరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కాటిగర్ శంకర్‌రావు, కోశాధికారి శివ్‌రతన్, సమాజ్ మీడియా చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు హెచ్ కుమార్, సలహాదారులు నగరి సురేందర్, బరాడి అశోక్, యశ్వంత్‌చవాన్, భరత్‌చవాన్, జయప్రకాశ్, శృతికృష్ణ, అజయ్‌చవాన్, సునీల్, అశోక్, ప్రశాంత్ పాల్గొన్నారు. – అబిడ్స్, జనవరి 7

నర్సింహయాదవ్ సంస్మరణ సభ

కాచిగూడ, జనవరి 7: నర్సింహయాదవ్ సంస్మరణ సభను ఆదివారం నింబోలిఅడ్డాలోని ఏకేభవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింహయాదవ్ చిత్రపటానికి కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్, నల్లకుంట కార్పొరేటర్ అమృత, మాజీ మంత్రి కృష్ణాయాదవ్, బీఆర్ఎస్ నాయకుడు బి.వెంకట్‌రెడ్డి, కన్నె రమేశ్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా వివిధ రాజకీయపార్టీల నేతలు నర్సింహయాదవ్ ప్రజలకు అందించిన సేవలను స్మరిస్తూ నివాళులర్పించారు.